నేడు హెచ్‌సీయూలో జాతీయ సదస్సు

రాయదుర్గం: కులగణన, సామాజిక న్యాయం అనే అంశంపై హెచ్‌సీయూలో శుక్ర, శనివారాల్లో జాతీయస్థాయి సదస్సును నిర్వహించేందుకు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి కిరణ్‌కుమార్, జాతీయ కార్యదర్శి సాయికిరణ్ తెలిపారు. ఈ సదస్సులో విద్యావేత్తలు, మేధావులు, సామాజిక కార్యకర్తలను ఒకతాటిపైకి తీసుకొచ్చి కులగణనపై ఉన్న అనేక అంశాలను, సందేశాలను చర్చించడం జరుగుతుందన్నారు. వర్చువల్ మోడ్‌లో కూడా జరిగే ఈ సదస్సులో ప్రముఖ విధాన రూపకర్త శ్యామ్ పిట్రోడా, ద్రావిడ కళగం కార్యదర్శి వీరమణి, డీఎంకే రాజ్యసభ సభ్యుడు పి విల్సన్, స్వరాజ అభియాన్ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ వెంకటేష్, ఆళ్ళ రామకృష్ణ వంటి ప్రముఖులు పాల్గొంటారన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో నాయకులు

మియాపూర్: మియాపూర్ హుడా మయూరినగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్, కూకట్‌పల్లి ఇంచార్జీ బండి రమేష్, సిర్పూర్ కాగజ్‌నగర్ ఇంచార్జీ శ్రీనివాస్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంను ప్రారంభించి అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఒకరికి పాజిటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం 09 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా, అందులో ఒకరికి పాజిటివ్ నిర్ధారణ అయిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు.అదేవిధంగా ఏడుగురికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

శిలాఫలకాలు వెక్కిరిస్తున్నాయి ..

- మంజీరా పైప్‌లైన్ రోడ్డు గుంతలమయం
- ఎన్నికల వేళ హడావిడిగా రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన
- ఆపై పట్టించుకున్న వారేరీ ?

హఫీజ్‌పేట్ : చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా పైప్‌లైన్ రోడ్డు గుంతలమయంగా మారింది. చెన్నారెడ్డి హాస్పిటల్ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు ఉన్న పైప్‌లైన్ రోడ్డు పూర్తిగా పాడైంది. గత ఎన్నికల సందర్భంగా నూతన పైప్‌లైన్ నిర్మాణం, రోడ్డు మరమ్మతుల పనులకు శంకుస్థాపన చేశారు. అవి శిలాఫలకాలకే పరిమితం అయ్యాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డులో ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గుంతలు, పారుతున్న నీటితో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. రోడ్డు పక్కన నడవాలంటే ఎటువైపు నుంచి వాహనాలు వస్తాయో నీరు మీదపడుతుందో అని పాదచారులు ఆందోళన చెందుతున్నారు.



చందానగర్ చెత్త సేకరణ కేంద్రం ఎదుట..

- మంజీరా రోడ్డులో మంచినీటి పైప్‌లైన్ లీకేజీలకు తక్షణమే మరమ్మతులు చేయాలి.
- మంజీరా రోడ్డు, చందానగర్ చెత్త సేకరణ కేంద్రం ముందు ఏర్పడ్డ భారీ గుంతను పూడ్చి వేయాలి
- లింగంపల్లి బీఆర్ గ్యాస్ కంపెనీ నుంచి చందానగర్ క్రిస్టల్ గార్డెన్ వరకు వేసిన సీసీ రోడ్డును ఆర్టీసీ కాలనీ వరకు పొడిగించాలి
- రోడ్డు విస్తరణ చేయడంతో బాటు వీధి దీపాలు ఏర్పాటు చేయాలి
- అధికారులు గుంతల రోడ్లపై ప్రత్యేక నిధుల ద్వారా నూతనంగా సీసీ రోడ్డు వేయాలి
- రోడ్డుకు ఇరువైపులా నో పార్కింగ్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- 100 ఫీట్ల మంజీరా రోడ్డు విస్తరణకు అనుమతులను అమలు చేయాలి.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి



చందానగర్‌లోని మంజీరా రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలి. నిత్యం ఎక్కడో ఒకచోట పైప్ లైన్ లీకేజీలతో రోడ్డుపై నీరు ఏరులై పారుతుంది. వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలి.

-పవన్, చందానగర్

కొత్త పైప్‌లైన్ వేయాలి



లింగంపల్లి- ఆర్టీసీ కాలనీ వరకు ఉన్న మంజీరా రోడ్డులో మూడు దశాబ్దల క్రితం తాగు నీటి పైప్‌లైన్ వేశారు. పైప్‌లైన్ శిథిలావస్థకు చేరడంతో నిత్యం లీకేజీలతో రోడ్డుపై ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వెంటనే అధికారులు నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభించాలి.

-సలీం, చందానగర్



చందానగర్ హుడాకాలనీ మంజీరా పైప్‌లైన్ రోడ్డులో ఏర్పడ్డ గుంతలు



గంగారం వద్ద మంజీరా పైప్‌లైన్ రోడ్డు



చందానగర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం ముందు రోడ్డులో..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాఘవేంద్ర కాలనీ సి బ్లాక్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొత్తగూడ మెయిన్ రోడ్డు, ప్రశాంత్‌నగర్ పరిసరాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్ : మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ ఫీడర్ల పరిధిలో..

- మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు బోర్ పార్కు, కేబుల్ పార్కు, డిఏవీ స్కూల్ పక్కన ఉన్న ఏరియా, రత్నదీప్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.
- మాధవనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఓల్డ్ సొసైటీ ఏరియా, ఎస్‌బిఐ, డిఏవీ స్కూల్, టెన్నిస్ కోర్టు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చందానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

- మదీనాగూడ సబ్‌స్టేషన్ హనుమాన్ టెంపుల్ (హఫీజ్‌పేట్) ఫీడర్ పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 02.00 గంటల వరకు మదీనాగూడ విలేజ్, ప్రణామ్ హాస్పటల్, మల్లన్న టెంపుల్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.
- మదీనాగూడ సబ్‌స్టేషన్ ఆల్విన్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 02.00 గంటల వరకు ల్యాండ్ మార్కు రెసిడెన్సీ, ఆర్టీసీ కాలనీ, జెనిసిస్ స్కూల్, తులసిరాం చాంబర్స్, నైమిషా అపార్ట్‌మెంట్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గోపన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

శేరిలింగంపల్లి: 33/11 కేవీ గోపన్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎన్‌టీఆర్ నగర్ ,ప్రతిమా ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని నల్లగండ్ల ఏఈ టి.వెంకట నారాయణరెడ్డి తెలిపారు.

- 11కేవీ ఎన్‌టీఆర్ నగర్ ఫీడర్ పరిధిలో ..గోపన్‌పల్లి తండా, ఎన్‌టీఆర్‌నగర్, తాజ్‌నగర్, సోఫా కాలనీల్లో ..
- 11 కేవీ ప్రతిమ ఫీడర్ పరిధిలో ప్రతిమ విల్లాస్, సాయిబాబ టెంపుల్, గోపన్‌పల్లి, రంగనాథ్‌నగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

హఫీజ్‌పేట్ : మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని.. శాంతినగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు దీప్తిశ్రీనగర్, శాంతినగర్, సువిశ ప్రాజెక్టు, టెక్నోపొలిస్, ధర్మపురి టెంపుల్, రోడ్డు నంబర్లు 12,13,14 తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

- సీబీఆర్ ఎస్టేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సీబిఆర్ అపార్ట్‌మెంట్, దీప్తిశ్రీనగర్ పార్కు, క్రోమా వెనుక, ఉషోదయ అపార్ట్‌మెంట్ తదితర ఏరియాలలో విద్యుత్ ఉండదని ఆయన తెలిపారు.

మియాపూర్‌లో..

మియాపూర్ : మయూరినగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓల్డేజ్ హోమ్, మయూరినగర్ ఎస్‌బీఐ బ్యాంక్ లైన్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ హరీష్‌సింగ్ తెలిపారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో...

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో.. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మియాపూర్ పోలీస్‌స్టేషన్ ఏరియా, క్రిష్ణదేవరాయ నగర్, సాయినగర్ కాలనీ, ఫార్చ్యూన్ హైట్స్, మదీనాగూడ మెయిన్ రోడ్డు, కృషినగర్, ప్రశాంత్‌నగర్, ఎంఏనగర్, స్టాలిన్‌నగర్, జేపీఎన్ నగర్, హెచ్‌ఎంటీ మక్త, మియాపూర్ మెయిన్ రోడ్డు, ఎఫ్‌సీఐ కాలనీ, టాకిటౌన్ ఏరియా, వీడియా కాలనీ, మియాపూర్ విలేజ్, జనప్రియ వెస్ట్ సిటీ, కృష్ణసాయి ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.

ఆధునిక వసతులతో ప్రభుత్వ పాఠశాలలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: విద్యారంగాన్ని బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు ఆధునిక వసతులతో పాఠశాలల భవనాలను నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.గురువారం పటాన్‌చెరు మండలం ఘనపూర్ గ్రామంలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సహకారంతో నాలుగు కోట్ల 50 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న 7000 మంది విద్యార్థులకు వచ్చే నెల మొదటి వారంలో మోటివేషనల్ క్లాసులతోపాటు ప్రతి విద్యార్థికి పరీక్షా కిట్లు అందించబోతున్నట్లు తెలిపారు.పాఠశాలల అభివృద్ధికి గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సీఎస్ఆర్ ద్వారా నిధులు కేటాయించడంపై సంస్థ యాజమాన్యానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్లాండ్ ఫార్మా పరిశ్రమ సిఎస్ఆర్ విభాగం అధిపతి రఘురామన్, ఎంపీపీ సుష్మా శ్రీ , జెడ్పీటీసీ సుప్రజా వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ కావ్య కాశిరెడ్డి, ఎంపీటీసీ సీనా చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ విఠలయ్య,ఎంఈఓ రాథోడ్, రాఘవేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్ నాయక్ ,పంచాయతీ పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో కశ్మీర్ యూనివర్సిటీ విద్యార్థులు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని కశ్మీర్ విశ్వవిద్యాలయం విద్యార్థులు గురువారం సందర్శించారు. వికసిత్ భారత్-2047 ఇనీషియేటివ్ కింద ఎడ్యుకేషన్ కమ్ కల్చరల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా వారు సందర్శించారు. మొదట వారు హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్‌తో సమావేశమయ్యారు. అనంతరం వారందరికీ వికసిత్ భారత్ ప్రచార వీడియోను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక మార్పిడి, ఆలోచనల మార్పిడి, జ్ఞాన వ్యాప్తిక దోహదపడే అనుసంధాన శక్తి ఎంతో అవసరమన్నారు. హెచ్‌సీయూ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ, డీన్ ప్రొఫెసర్ జెస్సికా, పలువురు ప్రొఫెసర్లు, అధికారులు పాల్గొన్నారు.

14మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలుశిక్ష విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. మంగళ, బుధవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో 14 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి 13 మందికి ఒక్కొక్కరికీ రూ. 10 వేల జరిమానా, మరో వ్యక్తికి రూ.10 వేల జరిమానాతో పాటు రెండురోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

ఉర్సు ఏర్పాట్లు పరిశీలన

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని మార్కెట్ రోడ్డులో గల హజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్ షహీద్ దర్గాలో ఈ నెల 22 నుండి నిర్వహించనున్న ఉర్సు ఉత్సవాల ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు.

క్రీడలకు కేంద్రం మైత్రి మైదానం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: దశాబ్దాల చరిత్ర కలిగిన మైత్రి మైదానాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి క్రీడా మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన 34వ మైత్రి ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 34 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం క్రికెట్ పోటీలు నిర్వహిస్తూ క్రీడా రంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్న మైత్రి క్రికెట్ క్లబ్ ను ఆయన ప్రశంసించారు. ఇటీవల ఏడు కోట్లతో మైత్రి క్రీడా మైదానాన్ని ఆధునీకీకరించామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ సుష్మా శ్రీ , కార్పొరేటర్లు మెట్టుకుమార్ యాదవ్, పుష్పనగేష్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ సపనా దేవ్, ఎస్సార్ గ్రూప్స్ ఎండిలు కే. సత్యనారాయణరెడ్డి, సి. సత్యనారాయణరెడ్డి, ఎస్సార్ ట్రస్ట్ అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షులు హనుమంత్‌రెడ్డి, గూడెం మధుసూదన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, క్రికెట్ క్లబ్ సభ్యులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలి

శేరిలింగంపల్లి సర్కిల్ డీసీ రజనీకాంత్‌రెడ్డి



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన డీసీ రజనీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: 18 ఏళ్ళు నిండిన వారంతా ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి సూచించారు. గురువారం జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్ళు నిండిన వారంతా విధిగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని ఓటరుగా నమోదు కావాలన్నారు. ఓటరు నమోదుతోపాటు ఏమైనా తప్పొప్పులు కూడా ఉంటే సరిదిద్దడానికి ఆన్‌లైన్ ద్వారానే చేయించుకోవాలన్నారు. ఓటరుగా మరో ప్రాంతానికి మార్పు చేసుకోవడానికి ఆన్‌లైన్ ద్వారానే చేసుకునేలా చూడాలన్నారు. తప్పొప్పుల సవరణ, ఓటరు నమోదు, ప్రాంతం మార్పు వంటి అంశాల కోసం శనివారం, ఆదివారం అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక క్యాంప్‌ను ఏర్పాటు చేసి అక్కడ ఓటరు జాబితాను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఈ జాబితాను పరిశీలించి తప్పొప్పులుంటే ఆన్‌లైన్ ద్వారా సరి చేసుకోవాలని సూచించారు.

ఓటుహక్కుపై అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవటంతో పాటు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని జిన్నారం తహశీల్దార్ రవికుమార్ సూచించారు. జిన్నారం మండలంలోని ఖాజీపల్లి పారిశ్రామికవాడలో గురువారం కార్మికులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు నిర్వహించారు. తహసీల్దార్ రవికుమార్ మాట్లాడుతూ అర్హులైన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా తమను సంప్రదించాలన్నారు. ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

అయోధ్యకు పట్టు వస్త్రాలు పంపిన సగర సంఘం



గచ్చిబౌలి: అయోధ్యకు తెలంగాణ సగర సంఘం రాష్ట్ర కమిటీ పట్టు వస్త్రాలను పంపింది.తెలంగాణ సగర యువజన సంఘం అధ్యక్షుడు మర్క సురేష్ ద్వారా ఈ పట్టు వస్త్రాలను పంపించారు. గురువారం గచ్చిబౌలిలోని రాష్ట్ర సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు ఉప్పరి శేఖర్, ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలకు ప్రత్యేక పూజలు చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్, శేఖర్, వేణుగోపాల్, దాయోదర్, కేపీరాములు, భీమయ్య, రవి, రామస్వామి పాల్గొన్నారు.

అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ ప్రత్యక్షప్రసారం

- టెలికామ్‌నగర్ సాయిదత్తగణపతి ఆలయంలో ఏర్పాట్లు

రాయదుర్గం: ఈనెల 22వ తేదీన అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంను ప్రత్యక్ష ప్రసారం చేయడానికి ఏర్పాట్లు చేశారు. టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయంలో ఉదయం 11 గంటల నుంచి భక్తులు తిలకించడానికి ఏర్పాట్లు చేశారు.


22న ప్రతి ఇంటా పండగ వాతావరణం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అయోధ్యలో నూతనంగా నిర్మించిన భవ్య రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా.. పటాన్‌చెరు పట్టణంలోని శ్రీ కోదండ సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమాలు ఉంటాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ పండగ వాతావరణంలో కార్యక్రమాన్ని నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ మెట్టుకుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్ సపాన్‌దేవ్, పట్టణ పుర ప్రముఖులు పాల్గొన్నారు.

చీరలు చుట్టి...హద్దు పెట్టి

- పోలీసులకు కేటాయించిన భూమినే ఆక్రమించే యత్నం



గోపన్‌పల్లిలో ప్రభుత్వ స్థలం ఆక్రమణ దృశ్యం

రాయదుర్గం/హఫీజ్‌పేట్: పోలీసు విభాగానికి కేటాయించిన ప్రభుత్వభూమినే ఆక్రమించేందుకు పలువురు యత్నించారు. అయితే సకాలంలో రెవెన్యూ, పోలీసు అధికారులు అక్కడకు రావడంతో వారు వెళ్లిపోయారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గోపన్‌పల్లిలో 34వ సర్వే నంబరులో 108 ఎకరాల 34 గుంటల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇందులో కొంత స్థలాన్ని పోలీసు విభాగానికి కేటాయించారు. గతంలో ఇక్కడ పోలీస్ పికెట్ కొనసాగేది. ఇటీవలి కాలంలో ఆ పికెట్ లేకపోవడంతో కొందరు ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు సిద్ధమయ్యారు. గురువారం చీరలతో చుట్టు హద్దులు ఏర్పాటు చేసుకొని ఈ స్థలం మాదే అంటూ ఆక్రమణలకు తెరలేపారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఆర్ఐ రాంబాబు సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. పోలీసుల సహాయంతో అందరినీ అక్కడి నుంచి పంపించివేశారు.

ఆర్ఐ ఫిర్యాదుతో కేసు నమోదు

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతోందని, దానిని కాపాడాలని, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని చందానగర్ పోలీసులకు ఆర్ఐ రాంబాబు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.



ప్రమాదకరం.. ఆ ఫెన్సింగ్

భయాందోళనలో పాదచారులు, వాహనదారులు



ప్రమాదకరంగా ఉన్న ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డు బ్రిడ్జి

ఆల్విన్‌కాలనీ: జగద్గిరిగుట్ట నుంచి భాగ్యనగర్ కాలనీ వైపు వెళ్లే పాత బ్రిడ్జి ఫెన్సింగ్ విరిగిపోయి ప్రమాదకర పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ రహదారిపై వందల సంఖ్యలో వాహనాలు వెళ్తాయి. పాదచారులు కూడా ఇదే బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తుంటారు. ఒక్కసారిగా వాహనాలు వస్తే పాదచారులు పక్కకు నడిచే పరిస్థితి కూడా లేదు. వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పితే పెను ప్రమాదాలు జరిగే ఆస్కారం మెండుగా ఉంది. గతంలో బ్రిడ్జి గోడలను వాహనాలు ఢీకొనటంతో విరిగిపడిపోయాయి. అలాగే వాహనాలు ఢీకొన్న ఘటనలో అనేకమంది గాయాలపాలైన సంఘటనలు కూడా ఉన్నాయి. దీంతో నాలుగేళ్ల క్రితం పక్కనే నూతన బ్రిడ్జిని నిర్మించారు. కానీ పాత బ్రిడ్జికి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. పాత బ్రిడ్జి, కొత్త బ్రిడ్జిలను కలిపి వన్‌వేలుగా వాడుతున్నారు.

- జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ అధికారులు రహదారులు నిర్మించే సంబంధిత శాఖాధికారులకు ఈ బ్రిడ్జి సమస్యను వివరించినా ఇప్పటి వరకు ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోలేదని ప్రజలు అంటున్నారు. ఫెన్సింగ్ సరిగా లేకపోవడంతో స్థానికంగా ఉన్న వారు చెత్తాచెదారం తీసుకొచ్చి అక్కడ పడేస్తున్నారు. కనీసం ఆ ప్రదేశంలో లోతైన గుంత కూడా ఉందన్న హెచ్చరిక బోర్డు కూడా లేకపోవటంతో స్థానికులు, ప్రయాణికులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారు. గతంలో ఈ బ్రిడ్జికి ఆనుకొని ఉన్న ఖాళీ ప్రదేశంలో చెత్త డంపింగ్ కోసం డస్ట్‌బిన్‌లు ఉండేవి.
- వాటిని తొలగించిన తర్వాత జీహెచ్‌ఎంసీ సిబ్బంది సైతం చెత్తను తీసుకొచ్చి ఈ బ్రిడ్జిపైనే ఉదయం వేళల్లో డంపింగ్ చేసి మధ్యాహ్నం తరలిస్తున్నారు. దీంతో పరిసరాలు దుర్గంధపూరితంగా మారాయి.ఇక మూగజీవాలు ఇక్కడ పడవేసిన వ్యర్థాలను తింటున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి వద్ద ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



షాపింగ్‌కు వెళ్లిన ఇద్దరు యువతులు అదృశ్యం



అదృశ్యమైన సంతోషిణి, వైష్ణవి

గచ్చిబౌలి: షాపింగ్ చేసేందుకు వెళ్లిన ఇద్దరు యువతులు అదృశ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సాయిలు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గౌలిదొడ్డిలో నివాసం ఉండే బాజారావు మహదేవ్ కూతురు సంతోషిణి(24)కి సంవత్సరం క్రితం బీదర్‌కు చెందిన అర్జున్‌తో వివాహం జరిగింది. సంతోషిణి ఆరు రోజుల క్రితం సంక్రాంతి పండుగ కోసం తల్లిగారింటికి వచ్చింది. మహదేవ్‌కు కోడలు వరుస అయ్యే యువతి ఏ.వైష్ణవి(22)తో 8 నెలల క్రితం కార్వాన్‌కు చెందిన గణేష్‌తో వివాహం జరిగింది. సంతోషిణి, వైష్ణవి షాపింగ్ చేసేందుకు కోఠి వెళుతున్నామని చెప్పి 17న మధ్యాహ్నం 12 గంటలకు ఓలా ఆటోలో ఇంటి నుంచి వెళ్లారు. సాయంత్రమైన తిరిగి రాకపోవడంతో ఫోన్ చేయగా ఇద్దరి సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉన్నాయి. రాత్రైనా తిరిగి రాకపోవడంతో మహదేవ్ గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. యువతుల కోసం గాలిస్తే సుల్తాన్ బజార్‌లో ఆటో దిగినట్లు గుర్తించినప్పటికీ వారి ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. పెళ్లైన యువతులు ఎక్కడికి వెళ్లారో అర్థం కావడం లేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.